క్లుప్తంగా

వరద బాధితులకు యూటీఎఫ్ చేయూత



కొల్లేరులో బాధితులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరద ముంపునకు గురైన కొల్లేరు గ్రామాలైన ఆనందపురం, ఏలూరు రూరల్ మండలం కోమటిలంక గ్రామ ప్రజలకు రూ.90 వేలు విలువ చేసే నిత్యాసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేసినట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ రుద్రాక్షి తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని డీఈఓ ఎస్ అబ్రహం ప్రారంభించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు, నాయకులు షేక్ ముస్తఫా అలీ, రవికుమార్ రుద్రాక్షి, బి.సుభాషిణి, కోమటిలంక గ్రామ సర్పంచ్ తెనాలి యోహాను తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్‌లో 'స్వచ్ఛతా హీ సేవ'

ఏలూరు(మెట్రో): జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం 'స్వచ్ఛతా హీ సేవ 2024' కార్యక్రమంలో భాగంగా జెడ్పీ చైర్‌పర్సన్ జి.పద్మశ్రీ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుబ్బారావు, డిప్యూటీ సీఈఓ ఎస్ నిర్మల జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానికంగానే వైద్య సేవలు అందించాలి

ఏలూరు (టూటౌన్) : ఆర్గనైజింగ్ సెక్టార్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు ఈఎస్ఐ ద్వారా వైద్య సేవలను స్థానికంగానే అందించేలా చూడాలని ఏఐటీయూసీ నాయకులు కె.కృష్ణమాచార్యులు డిమాండ్ చేశారు. ఏలూరు ఈఎస్ఐ డిస్పెన్సరీకి వచ్చే ఉద్యోగులు, కార్మికులను మెరుగైన వైద్య సేవల పేరుతో విజయవాడ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారని ఆరోపించారు. ఏలూరులోని ఆశ్రం లాంటి ఆస్పత్రులకు రిఫర్ చేసే అవకాశం ఉన్నా విజయవాడ రిఫర్ చేయడం సరికాదని పేర్కొన్నారు

ఎస్పీకి కాంగ్రెస్ నేతల వినతి

ఏలూరు టౌన్: పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ మంత్రులు, ఎమ్మెల్యేలపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు కోరారు. ఈ మేరకు ఆయన పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ప్రతాప్ శివకిషోర్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. పీసీసీ జనరల్ సెక్రటరీ గౌతు సత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

కీళ్ల నొప్పులతో కదల్లేం.. నడవలేం!

- జ్వర పీడితుల్లో నెల రోజులకూ తగ్గని వైనం
- రూ.వేలకు వేలు ఖర్చు
- కానరాని ఉపశమనం





ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్ల గదుల బయట వైద్యం కోసం బారులు తీరిన రోగులు

ఏలూరు (టూటౌన్): ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది జ్వరాలు చాలా వైవిధ్యంగా ఉన్నాయి. జ్వరం వచ్చి తగ్గిన తర్వాత కూడా కీళ్ల నొప్పులు, చేతులు, కాళ్ల తిమ్మెరలు వేధిస్తున్నాయి. కొందరు మంచాలకే పరిమితమవుతున్నారు. మంచం మీద నుంచి కింద కాలు పెట్టలేనంత నొప్పితో అల్లాడుతున్నారు. మంచం మీద పడుకున్నా నొప్పులు భరించలేనంతగా ఉంటున్నాయి. మరికొందరు కర్రల ఊతంతో నడవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఇలా నెల నుంచి నెలా 15 రోజుల పాటు కీళ్ల నొప్పులతో బాధితులు ఇబ్బందులు పడుతున్నారు.

ఏలూరు నగరంలో 8,132 మంది బాధితులు

ఏలూరు నగర పరిధిలోనే గత నెల రోజులుగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో జ్వరం బారీన పడి వైద్యం చేయించుకున్న వారి సంఖ్య దాదాపు 15 వేలకు పైగా ఉంది. వీరిలో 40 శాతం మంది అంటే సుమారు ఆరువేల మంది వరకు ఏలూరు పరిసర ప్రాంతాల వారు. ఒక్క ఏలూరు నగరానికి చెందిన వారే 9000 మంది వరకు జ్వరం బారీన పడ్డారు. వీరిలో గత 15 నుంచి నెల రోజుల మధ్యలో జ్వరం వచ్చి తగ్గినా కాళ్లు, చేతులు నొప్పులు, తిమ్మెరలతో బాధపడేవారి సంఖ్య 8,132 మంది వరకు ఉంది.

ఓపీలో సగం మంది జ్వర పీడితులే

ఏలూరు సర్వజన ఆసుపత్రికి ప్రతి నిత్యం 500 నుంచి 600 మంది వరకు ఓపీ ఉంటుంది. వీరిలో సగం మంది వరకు జ్వరబాధితులే ఉండటం విశేషం. వీరంతా ముందుగా సాధారణ జ్వరాలే అని వైద్యులతో పరీక్షలు చేయించుకుని వెళ్లిపోతున్నారు. మూడు నుంచి ఐదు రోజుల్లో జ్వరం తగ్గిపోతుంది. తర్వాత మొదలవుతుంది కీళ్ల నొప్పుల సమస్య. దీంతో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి వేలకు వేలు ఖర్చు చేసినా వెంటనే తగ్గక దిక్కు తోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

రూ.10 వేల వరకు ఖర్చు

జ్వర పీడితులు కీళ్ల నొప్పుల స్థాయిని బట్టి రూ.5 వేలు నుంచి రూ.10 వేలు వరకు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సూపర్ స్పెషాలిటీ, కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లేవారు రూ.15 వేలు నుంచి రూ.20 వేలు వరకు చేతి చమురు వదిలించుకోవాల్సి వస్తుంది.

ఆస్పత్రులు, ల్యాబ్‌లకు కాసుల పంట

జ్వరపీడితులు భరించలేని కీళ్ల నొప్పులు ప్రైవేటు ఆస్పత్రులు, పరీక్షా కేంద్రాలకు కాసులు కురిపిస్తున్నాయి. బాధితుల భయాందోళనను వారు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. వైద్యులు రోగులకు అన్ని రకాల పరీక్షలు చేయించాలంటున్నారు. ఆ చీటీ పట్టుకుని పరీక్షా కేంద్రాలకు వెళితే అక్కడి రూ.2వేల నుంచి రూ.3వేలు బిల్లు వేస్తున్నారు. దీనికి తోడు ఆస్పత్రి బిల్లు, మందుల ఖర్చు, రవాణా ఖర్చు ఉండనే ఉంది. దీంతో జ్వరపీడుతులకు దిమ్మతిరిగి కళ్లు బైర్లుకమ్ముతున్నాయి.

కాళ్లు, చేతులు ఒకటే నొప్పులు



నాకు జ్వరం వచ్చి మూడు రోజుల్లో తగ్గిపోయింది. జ్వరం తగ్గి దాదాపు నెల రోజులవుతుంది. వైద్యులు సాధారణ జ్వరమే అని చెప్పారు. ఐదో రోజు నుంచి కాళ్లు, చేతులు ఒక్కటే లాగడం, నొప్పులు పుట్టడం ప్రారంభమైంది. కొద్ది రోజులు మంచంపై నుంచి కిందికి దిగాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైద్యుల సూచనల మేరకు మందులు వాడుతున్నాం. నెల రోజులు కావస్తున్నా నేటికీ పూర్తి స్థాయిలో నొప్పులు తగ్గలేదు.

– మెండెం సంతోష్ కుమార్, విద్యానగర్, ఏలూరు

వైరల్ ఆర్థరైటిస్



ఈ ఏడాది జ్వరాలు విభిన్నంగా ఉన్నాయి. జ్వరం తగ్గిన తర్వాత కీళ్ల నొప్పులు వస్తున్నాయి. వైరల్ జ్వరంలో కూడా తీవ్రమైన ఒళ్లు నొప్పులు వచ్చే అవకాశం ఉంది. కీళ్ల నొప్పులు రావడాన్ని వైరల్ ఆర్థరైటిస్‌గా భావిస్తున్నాం. ఇది తాత్కాలికమే 15 నుంచి నెల రోజుల్లో సాధారణ స్థితికి చేరుకుంటారు. నొప్పులు క్రమేణా తగ్గుతాయి. అధికంగా నొప్పుల మందులు, స్టెరాయిడ్స్ వాడటం ఆరోగ్యానికి మంచిది కాదు.

– బి.కృష్ణ, ఆర్థోపెడిక్ వైద్యుడు, శ్రీ కృష్ణ హాస్పిటల్, ఏలూరు

విశ్రాంతి తీసుకోవాలి



జ్వర బాధితులు ఎన్నడూ లేని విధంగా కీళ్ల నొప్పులు, తిమ్మెరలతో బాధపడుతున్నారు. వీరు విశ్రాంతి ఎక్కువగా తీసుకోవాలి. అధికంగా మంచి నీరు తాగాలి. యాంటీ బయాటిక్స్ ఎక్కువగా వాడవద్దు. బి కాంప్లెక్స్, జింకోవిట్ వంటి విటమిన్ బిళ్లలు వేసుకోవాలి. వారానికి ఒకసారి వైద్యులను సంప్రదించాలి. భయపడాల్సిన పని లేదు.

– నెరుసు సాయి శ్రీ వల్లి, ప్రభుత్వ వైద్యురాలు, ఏలూరు

సీసీఎస్ ఎస్సై మృతికి సంతాపం



ఎస్సై నరసింహారావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ కేపీ శివకిషోర్

ఏలూరు టౌన్: ఏలూరు సీసీఎస్ ఎస్సై డి.నరసింహారావు గుండెపోటుతో బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ గురువారం సందర్శించి, పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నరసింహారావు భార్య పద్మావతి, కుమారులు సీతారాం, సుందర్‌కు ఎస్పీ ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. నరసింహారావు మృతి ఎనలేని లోటని అన్నారు. నరసింహారావు మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించిన వారిలో ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ, ఎస్సైలు బి.శ్రీనివాసరావు, మక్బూల్, బొక్క రామకృష్ణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మహిళలు, బాలికలకు రక్షణ కల్పించాలి



బాలికల సవతి గృహాన్ని సందర్శించి అక్కడి వారితో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

ఏలూరు (టూటౌన్): మహిళలు, బాలికలకు రక్షణ కల్పించాలని, వసతి గృహంలో లైంగిక దాడులకు పాల్పడిన శశికుమార్‌ను తక్షణం అరెస్ట చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ నిర్వహించాలని ఐద్వా డిమాండ్ చేసింది. ఈమేరకు ఐద్వా నాయకుల బృందం గురువారం అమీనాపేటలోని వసతి గృహాన్ని సందర్శించి అక్కడి బాలకతో మాట్లాడింది. ఈసందర్భంగా జిల్లా కమిటీ అధ్యక్షురాలు ఏ.రాణి మాట్లాడుతూ వసతి గృహం రక్షకులే భక్షకులుగా మారడం అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇటీవల ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో అత్యవసర వైద్య విభాగంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్‌పై పేషెంట్ తాలూకా వ్యక్తులు దౌర్జన్యంకు పాల్పడడం, అలాగే కొద్ది రోజుల కిందట ఏలూరు నడిబొడ్డున భర్తముందే ఓ వివాహిత తాగుబోతుల చేతుల్లో అత్యాచారానికి గురవడం.. ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. తక్షణం న్యాయం చేయకుంటే బాధితుల పక్షాన ఐద్వా ఉద్యమం చేపడతుందని తెలిపారు. వసతి గృహం సదర్శించిన వారిలో ఐద్వా నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

శశికుమార్‌ను శిక్షించాలి



ఎస్పీ ప్రతాప శివ కిషోర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు టౌన్/ ఏలూరు (టూటౌన్): స్థానిక అమీనా పేటలోని స్వామి దయానంద సరస్వతి వసతి గృహంలో బాలికలపై లైంగిక దాడులకు పాల్పడిన వార్డెన్ భర్త శశికుమార్‌ను తక్షణం అరెస్టు చేసికఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య, ఏఐఎస్ఎఫ్ఐ డిమాండ్ చేశాయి. ఈ మేరకు గురువారం రెండు సంఘాల జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఎస్పీ కె.ప్రతాప శివ కిషోర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం స్థానిక ఆర్ఆర్‌పేటలోని సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా సమితి కార్యదర్శి మన్నవ యామిని మాట్లా డుతూ వసతి గృహానికి అనుమతులు లేవని బహిర్గతమైందని, వార్డెన్ ఫణిశ్రీ, ఆమె భర్త శశికుమార్‌లను తక్షణమే అరెస్టు చేసి కోర్టుకు పంపాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేయించాలని, బాలికల చదువు, వసతికి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ఐ రాష్ట్ర కోశాధికారి సాయిబాబా మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పరకా శ్యామల, ఏఐఎస్ఎఫ్ఐ నాయకులు ఎం సాథిక్, స్త్రీ విముక్తి ఘటన నాయకులు టి.చిన్ని, పీడీఎస్ఓ జిల్లా కార్యదర్శి ఎస్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి



ఏలూరు జిల్లా నూతన కార్యవర్గంతో రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి

ఏలూరు టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల ఆరోగ్య సంరక్షణకు విశేష సేవలందిస్తోన్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు సూపర్‌వైజర్లుగా పదోన్నతులు కల్పించాలని ఉమెన్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు వీకేఎస్ జయలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక ఏపీ ఎన్జీవో భవనంలో గురువారం ఏర్పాటుచేసిన కార్యవర్గ సమావేశంలో ఏలూరు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కె.నాగమణి, ఉపాధ్యక్షురాలిగా కె.పద్మజ, ఎన్ రేణుక, కార్యదర్శిగా వీపీ నాగలక్ష్మి, జాయింట్ సెక్రటరీగా టి.ధనలక్ష్మి, ట్రెజరర్ జె.మరియమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దవగల్బి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ 27 సంవత్సరాలుగా ఎలాంటి పదోన్నతులు లేకుండా మల్టీమర్పస్ హెల్త్ అసిస్టెంట్లుగానే మిగిలిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్‌వైజర్లుగా పదోన్నతుల కల్పించేందుకు జీఓ 143ను అమలు చేయాలని కోరారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఒక పీహెచ్ఎన్‌ను నియమించాలన్నారు. నూతన అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ జీఓ 115 అమలు చేయాలని, ఏఎన్ఎం నుంచి శిక్షణ పొందిన వారిని వెనక్కి పంపటం సరికాదన్నారు. వారికి జీఎన్ఎం పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించేందుకు ఏఎన్ఎంలే కీలకమని చెప్పారు. కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షురాలు ఎం వీ సావిత్రి, కార్యదర్శి కేఎస్ఎస్ కుమారి, జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన సంఘం కార్యకర్తలు ఉన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమాజంలో బాల్య వివాహాలను నిరోధించాల్సిన అవసరం ఉందని స్థానిక ఎస్‌పీడీబీటీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌వీఎస్ఎన్ మూర్తి అన్నారు. చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్, కై లాష్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎస్‌పీడీబీటీ కళాశాలలో బాల్య వివాహ వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మూర్తి మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికలకు అనారోగ్య హేతువులన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు టి.ప్రేమ్ కుమార్, చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో ఫ్లెక్సీల రగడ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): టీడీపీ చోటా నాయకత్వంలో అంతర్మథనం ప్రారంభమైనట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యే బడేటి చంటి వ్యవహార శైలి వారికి మింగుడుపడడంలేదని ప్రచారం. అధికారంలో లేకపోయినా ఐదేళ్లపాటు పార్టీని అంటిపెట్టుకుని, పార్టీని ప్రజల్లో సజీవంగా ఉండేలా కష్టపడ్డ స్థానిక నాయకులకు ఎమ్మెల్యే ప్రాధాన్యత ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు. ఐదేళ్లపాటు తాము కష్టపడితే వైఎస్సార్ సీపీ నుంచి వలస వచ్చిన వారికే ఎమ్మెల్యే ప్రాధాన్యత ఇస్తున్నారని రగిలిపోతున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చి 100 రోజులు గడిచినా ఎన్నికల మ్యానిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోవడంతో ప్రజల్లోకి వెళ్లాలంటేనే భయమేస్తోందని ఆందోళన చెందుతున్నారు. తాజాగా టీడీపీలో ఫ్లెక్సీల వివాదం తారాస్థాయికి చేరింది. స్థానిక శనివారపు పేట రోడ్డులోని అమరావతి సర్కిల్ వద్ద ఆ ప్రాంతానికి చెందిన టీడీపీ మహిళా నాయకురాలు ఇటీవల వినాయక చవితి సందర్భంగా కట్టా సుబ్బారావు తోట ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఒక ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన కొన్ని గంటలకే మాయమైంది. దీనిపై సదరు మహిళా నాయకురాలు ఆరా తీయగా మేయర్ తాలూకా వాళ్ల ఆదేశాలతో ఆ ఫ్లెక్సీని కార్పొరేషన్ కార్మికులు తొలగించారని సమాధానం వచ్చింది. దీనిపై విస్తుపోయిన సదరు మహిళా నాయకురాలు ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి తన గోడును వెళ్లబోసుకున్నారని, అయితే కార్యాలయంలోని షాడో ఎమ్మెల్యేగా పిలవబడే కంప్యూటర్ పేరున్న వ్యక్తి ఈ విషయాన్ని లైట్ తీసుకోవాలని చెప్పి పంపించేశారని తెలిసింది. అసలు విషయమేమిటంటే మేయర్ ఫొటో లేకపోవడంతో ఆ ఫ్లెక్సీని తొలగించినట్టు తెలిసింది.

ఏపీ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ వితరణ

ఏలూరు (టూటౌన్): విజయవాడ సింగ్ నగర్‌లో వరదలకు ఇబ్బందులు పడుతున్న ఎలక్ట్రికల్ కార్మికుల 50 కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సహకారంలో గురువారం నిత్యావసర వస్తువులను అందజేశారు. నిత్యావసరాలతో ఏలూరు నుంచి బయలు దేరిన వాహనాన్ని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బొత్స రామకృష్ణ, మంత్రి ప్రగడ శ్రీనివాసరావు, బత్తిన శ్రీనివాసరావు, నాయుడు గంగాధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వాలి



గుడివాకలంకలో సరకులు అందిస్తున్న నాయకులు

ఏలూరు రూరల్ : ప్రభుత్వం కొల్లేరు గ్రామాల్లో వరద బాధితులకు రూ.25 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం ఏలూరు రూరల్ మండలం గుడివాకలంకలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు, ప్రజల నుంచి సేకరించిన సొమ్ముతో సుమారు 700 కుటుంబాలకు నిత్యాసరాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఘంటసాల నాగరాజు, సీఐటీయూ నాయకులు కొర్రి విజయలక్ష్మి, రజని, భవాని, స్వప్న, లలిత, ఝాన్సీ, వెంకటలక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆటో నగర్, కొమరవోలు, తూర్పులాకులు, సాయి నగర్ లైన్లలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, వెంకన్న చెరువు సబ్ స్టేషన్ పరిధిలోని కందకం రోడ్డు, దక్షిణపు వీధి, అశోకచక్రం రోడ్డు, పోణంగి రోడ్డు, అరుధంతి పేట, పడమర వీధి, దొంగల మండపం రోడ్డు, పాలతూము సెంటర్, శనగ పప్పు బజారు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	25
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	31
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	28
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	34
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	36
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	32
ఏలూరు - తిరుపతి	16.00	4830	26

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	48	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	68	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	48	ములక్కాడలు	07-10
బెండకాయలు	40	కంద	60
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	38
కాకర కాయలు	48-54	కీరా దోస	46
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	60	అల్లం	80-160
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	45
క్యారెట్	40	పాలకూర	15
దొండకాయలు	40	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	15
ఉల్లిపాయలు	58	గోంగూర	07
గోరుచిక్కుడు	50	పుదీనా	05
దోసకాయలు	28	బఠాణి	--
ఆనబకాయ (1)	30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	60

వ్యవసాయ అధికారులకు శిక్షణ

ఏలూరు(మెట్రో): వ్యవసాయంలో పురుగు మందు లు, రసాయనిక ఎరువుల వినియోగం, సాగు ఖర్చు లు తగ్గించుకుని నాణ్యమైన ఉత్పత్తులను పండించడం అవసరమని ఏలూరు జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా అన్నారు. గురువారం ఏలూరు ఐఏడీపీ హాల్‌లో వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులకు మేలైన సాగు యాజమాన్య పద్ధతులు (జీఏపీ) పొలంబడి, ఇండిగాప్ సర్టిఫికేషన్ పై శిక్షణ ఇచ్చా రు. వ్యవసాయశాఖ కమిషనరేట్ ఏడీఏ వెంకటేశ్వర్లు జీఏపీ పొలంబడి, ఐఎస్‌డీ జీఏపీ సర్టిఫికేషన్, మాన్యువల్ తయారీని వివరించారు. వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఏఓ లక్ష్మీరెడ్డి ఫార్మర్స్ డైరీలు రాసే విధానాన్ని తెలియజేశారు. ఏపీఎస్ఓపీసీఏ సీనియర్ ఆఫీసర్ ప్రతాప్ రెడ్డి, క్యూఎంఎస్ ఆడిట్ చెక్ లిస్ట్ తయారు చేయుట, సీపీసీసీ చెక్ లిస్ట్ లోని మోడల్స్ గురించి వివరించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి వారి కార్యాలయపు ఏడీఏ, ఏఓ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.